సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 5 । జూలై । 2024



'భరోసా' దక్కేనా..?

కౌలు రైతులకు కూడా 'భరోసా' అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో కౌలుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. 8లో



..సాదరంగా స్వాగతించాలి

సమస్యలు తెలిపేందుకు ఐటీడీఏకు వచ్చే గిరిజనులను సాదరంగా స్వాగతించాలని పీఓ రాహుల్ అన్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
30° / 25°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగానే ఉంటాయి. సాయంత్రం ఓ మోస్తరు జల్లులు పడొచ్చు.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో వైభవంగా రుద్రహోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం-జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో గురువారం వైభవంగా రుద్రహోమం నిర్వహించారు. ముందుగా అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేశారు. అనంతరం మాస శివరాత్రిని పురస్కరించుకుని రుద్రహోమం జరిపించారు. మొదట మండపారాధన, గణపతిపూజ, చివరన పూర్ణాహుతి గావించారు. హోమంలో పాల్గొన్న వారికి అమ్మవారి శేష వస్త్ర ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వేదపండితులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పెద వాగు ప్రాజెక్టు గ్రామంలోగల తెలంగాణ గిరిజన మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన గిరిజన బాలికలు బీఏ, బీకాం, బీకాం(సీఏ), బీజెడ్‌సీ, ఎంపీసీ గ్రూపుల్లో ప్రవేశాలకు ఈ నెల 6, 7 తేదీల్లో స్పాట్ కౌన్సెలింగ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థినులు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు హాజరు కావాలని, సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, 8 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకుని రావాలని సూచించారు.

ఆకాశవాణిలో నేటి నుంచి 'తెలుగు పద్మాలు'..

చుంచుపల్లి: ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ప్రజా ప్రసార సేవలో 75వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా 'తెలుగు పద్మాలు' శీర్షికతో శుక్రవారం నుంచి ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రసారం చేయనున్నట్లు కొత్తగూడెం ఆకాశవాణి కేంద్రం హెడ్ బైరి శ్రీనివాసన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించి, కేంద్ర ప్రభుత్వంచే 'పద్మ' పురస్కారాలు అందుకున్న ప్రముఖుల పరిచయాలతో కూడిన ధారావాహిక కార్యక్రమం నేటి నుంచి ప్రతిరోజూ ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి కేంద్రాల నుంచి వినే అవకాశం ఉందని తెలిపారు.

నాగపూర్ - అమరావతి హైవేపై హైకోర్టు స్టే

రఘునాథపాలెం: నాగపూర్ నుంచి అమరావతి వరకు నిర్మిస్తున్న ఎక్స్‌ప్రెస్ హైవేపై హైకోర్టు గురువారం స్టే విధించిందని పిటీషన్ దాఖలు చేసిన రైతులు వెల్లడించారు. ఎన్‌హెచ్ 163-జీ పేరుతో నిర్మిస్తున్న ఈ హైవేకు సంబంధించి తీర్థాల నుంచి వి.వెంకటాయపాలెం సెక్షన్‌లో 29 మంది రైతులు, ప్లాట్ల యజమానులు ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు. హైవే ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో నగరాన్ని చీలుస్తూ వెళ్లడంతో మూడు లక్షల మంది నగరవాసులపై ప్రభావం పడుతుందని, హైవే నిబంధనలకు వ్యతిరేకంగా అలైన్‌మెంట్ చేశారని కోర్టులో పిటీషన్ దాఖలు చేశామని పలువురు వెల్లడించారు. ఈమేరకు న్యాయవాది హరిబాబు వాదించగా తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు తమ భూములను స్వాధీనం చేసుకోవద్దని హైకోర్టు ఆదేశించిందని పేర్కొన్నారు.

మావోలపై ఉక్కుపాదం



చర్ల మండలంలోని కొండవాయి గ్రామం

మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జాయింట్ టాస్క్ ఫోర్స్ (జేటీఎఫ్) యూనిట్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం న్యూ ఢిల్లీలో కోరారు. దీంతో జేటీఎఫ్ ఏర్పాటు, పనితీరు తదితర అంశాలపై చర్చ జరుగుతోంది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

జిల్లాలో జేటీఎఫ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

- చర్ల మండలం కొండవాయి గ్రామం ఎంపిక
- కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కోరిన సీఎం రేవంత్‌రెడ్డి
- సింగరేణి బొగ్గు బాక్‌లు, నేషనల్ హైవేలపై చర్చ

సమన్వయంతో పని చేసేలా..

దేశ వ్యాప్తంగా చూస్తే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్ అడవుల్లో మావోయిస్టుల ప్రభావం ఎక్కువగా ఉంది. ఈ రాష్ట్రంతో సరిహద్దులు పంచుకుంటున్న మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాలపై కూడా మావోయిస్టుల ప్రభావం ఉంది. దీంతో వామపక్ష తీవ్రవాదాన్ని అణచివేసేందుకు ఛత్తీస్‌గఢ్‌తో సరిహద్దు కలిగిన రాష్ట్రాలు కలిసికట్టుగా పని చేసేలా జాయింట్ టాస్క్ ఫోర్స్ యూనిట్లను ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఇప్పటికే ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గడ్చిరోలి జిల్లాలో జేటీఎఫ్ యూనిట్ ఏర్పాటు చేశాయి. ఇదే తరహాలో భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో జేటీఎఫ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

చర్ల మండలంలో..

జిల్లాలో గోదావరి తీరం వెంట ఛత్తీస్‌గఢ్‌తో సరిహద్దు పంచుకుంటున్న దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో మావోయిస్టుల ప్రభావం ఎక్కువగా ఉంది. ముఖ్యంగా బీజాపూర్ జిల్లాకు సరిహద్దున ఉన్న చర్ల.. తెలంగాణలో మావోయిస్టు కార్యకలాపాలకు అడ్డాగా మారిందనే భావన పోలీసు వర్గాల్లో ఉంది. దీంతో ఈ మండలంలోని కొండవాయి గ్రామంలో జేటీఎఫ్ యూనిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జేటీఎఫ్‌లో ఛత్తీస్‌గఢ్, తెలంగాణ పోలీసులతో పాటు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్), ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ), సశస్త్ర సీమబల్ (ఎస్ఎస్‌బీ) దళాలు ఉండే అవకాశం ఉంది. మావోయిస్టుల కార్యకలాపాలకు సంబంధించి సమాచారం అన్ని వర్గాలు ఇచ్చిపుచ్చుకుంటాయి.

కర్రెగుట్టల కేంద్రంగా..

వెంకటాపురం – చర్ల మండలాల్లో విస్తరించి ఛత్తీస్‌గఢ్‌తో సరిహద్దు పంచుకుంటున్న కర్రెగుట్టలు మావోయిస్టులకు అడ్డాగా ఉన్నాయి. ఇక్కడున్న అనుకూలతను ఆసరాగా చేసుకుని ఆ పార్టీ ఓ ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేసుకుంది. తద్వారా తిరిగి తెలంగాణలో పట్టు సాధించేందుకు ప్రయత్నాలు సాగిస్తోంది. ఈ తరహా ప్రయత్నాలకు ఆదిలోనే చెక్ పెట్టేందుకు చర్ల మండలం కొండవాయి, వెంకటాపురం మండలం ఆలుబాకలో జేటీఎఫ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం మండలాల పరిధిలో సీఆర్‌పీఎఫ్ క్యాంపులు, బెటాలియన్లు 14 వరకు ఉన్నాయి. వీటిలో సుమారు ఐదున్నర వేల మంది జవాన్లు మావోయిస్టుల అణచివేత విధుల్లో నిమగ్నమై ఉన్నారు.

బొగ్గు బ్లాక్‌లు వేలం వేయొద్దు

సింగరేణి పరిధిలోని బొగ్గు బ్లాకులను వేలం వేయకుండా సంస్థకే కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే వేలంలో ప్రైవేటు కంపెనీలకు అప్పగించిన శ్రావణపల్లి, సత్తుపల్లి-3, కోయగూడెం బ్లాకులను తిరిగి సింగరేణికి కేటాయించాలన్నారు. భద్రాద్రి జిల్లా పరిధిలోని సారపాక నుంచి ములుగు జిల్లా ఏటూరునాగారం వరకు ఉన్న రోడ్డుకు జాతీయ రహదారి హోదా కల్పించాలని, ఖమ్మం – కొత్తగూడెం పట్టణాలను జాతీయ రహదారులతో కలిపేలా కొత్తగూడెం – తల్లాడ – వైరా – జగ్గయ్యపేట రోడ్డుకు సైతం ఎన్‌హెచ్ హోదా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు విభజన చట్టంలో పేర్కొన్న విధంగా బయ్యారంలో ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఏపీలో విలీనమైన ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలని కోరారు.

నేడు డ్రిల్ ఆపరేటర్లకు వెబ్ కౌన్సెలింగ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న డ్రిల్ ఆపరేటర్లకు శుక్రవారం వెబ్ కౌన్సిలింగ్ ద్వారా కార్పొరేట్ అధికారులు పోస్టింగ్ కల్పించనున్నారు. ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెం ప్రాంతాలకు చెందిన వారు మణుగూరు వెబ్ సెంటరకు, మిగతా ఏరియాల వారు రామగుండం వెబ్‌సెంటర్ ద్వారా వారికి కావాల్సిన ఏరియాల్లో (ఖాళీల ఆధారంగా) ఎంచుకునే అవకాశాన్ని కల్పించారు. అయితే ఈ వెబ్ కౌన్సెలింగ్‌ను కార్పొరేట్ ఏరియాలోని సెంటర్ నుంచి మానిటరింగ్ చేస్తారని తెలిసింది.

మాటలు కాదు.. ఆచరణ ఉండాలి



శాంతినగర్ వద్ద రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- ఆశ్రమ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

టేకులపల్లి : విద్యార్థులకు మాటలు చెప్పడం కాదని.. ఏ పని అయినా ఆచరణలో చేసి చూపించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలో గురువారం పర్యటించిన ఆయన.. ముత్యాలంపాడు క్రాస్‌రోడ్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలు, తల్లులు, గర్భిణుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల బరువు, ఎత్తు కొలిచే ప్రక్రియను పరిశీలించారు. అంగన్‌వాడీలో సేవలు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పక్కనున్న ప్రాథమిక పాఠశాలకు వెళ్లి ఉన్న ఇద్దరు విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించి నోట్ పుస్తకాలు అందజేశారు. ఆ తర్వాత కోయగూడెం ఆశ్రమ పాఠశాలలో తరగతి గదులు, ఆవరణ, వంట గదులు, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. నిరుపయోగంగా ఉన్న ఆర్‌ఓ ప్లాంట్, బాయిలర్ల వివరాలు అందజేయాలని ఏటీడీఓను ఆదేశించారు. పాఠశాలలో ఏమైనా సమస్యలున్నాయా అని ఉపాధ్యాయులను అడగగా.. ఓవర్ హెడ్ ట్యాంక్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలని కోరగా.. ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు బదులు సింటెక్స్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మొక్కలు నాటేందుకు గుంతలు తీసిన ప్రాంతంలో పిచ్చి మొక్కలు ఉండడాన్ని గమనించిన కలెక్టర్.. స్వయంగా పార పట్టి ఆవరణ శుభ్రం చేశారు. మొక్కలు నాటి సంరక్షించే బాధ్యతను విద్యార్థులకు అప్పగించాలని అన్నారు.

సాగు ఎలా ఉంది..

కోయగూడెం నుంచి తిరిగి వస్తుండగా దారిలో మిర్చి తోటలో పాటు చేస్తున్న రైతును చూసి అక్కడ ఆగారు. రైతు చేతుల కన్నయ్య అరకతో పాటు చేస్తుండగా ట్రాక్టర్ లేదా, ఎన్ని సంవత్సరాలుగా ఎద్దులతో అరక దున్నుతున్నారు.. వ్యవసాయం లాభసాటిగా ఉందా.. అని అడిగి తెలుసుకున్నారు. గతేడాది నష్టం వచ్చిందని, ప్రస్తుతం మిర్చి సాగు చేస్తున్నానని రైతు వివరించాడు. కలెక్టర్ వెంట జిల్లా సంక్షేమాధికారి విజేత, సీడీపీఓ కె.ఎం.తార, తహసీల్దార్ నాగభవాని, ఎంపీడీఓ జి.రవీంద్ర రావు, ఏటీడీఓ రాధ, ఎంపీఓ గాంధీ, ఏపీఓ శ్రీనివాస్, ఏపీఎం రవి, ఏఓ అన్నపూర్ణ, ఏఈ సుజిత ఉన్నారు.

దొడ్డి కొమరయ్యకు నివాళి

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కొమరయ్య వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భూమి, భుక్తి, శ్రామిక జన విముక్తి కోసం అవిశ్రాంత పోరాటం చేసిన మహా నీయుడని కొనియాడారు. దొరల దురాగతాలను ఎదిరించిన వీరుడని, వరంగల్ జిల్లాలో సాధారణ గొర్రెల కాపరుల కుటుంబంలో జన్మించిన కొమరయ్య తెలంగాణ సాయుధ పోరాటానికి ఆద్యుడయ్యాడని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, బీసీ సంక్షేమాధికారి ఇందిర, ఉపాధి కల్పన అధికారి విజేత, కలెక్టరేట్ ఏఓ గన్యా, కురుమ సంఘం సభ్యులు సీహెచ్ సాయిలు, జి.కిరణ్‌కుమార్, సాయికుమార్, పోలె జగదీష్, కోటిలింగం, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సంపూర్ణ అభియాన్ ప్రారంభం..

జిల్లా, మండల నీతి ఆయోగ్ ఆస్పిరేషన్ అకాంక్షిత కార్యక్రమంలో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. మొదట మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. సమగ్ర అంగన్‌వాడీ సేవలు, విధి విధానాలను బొమ్మల రూపంలో చూపించిన మహిళా శిశు సంక్షేమ శాఖను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సంపూర్ణత అభియాన్‌లో పేర్కొన్న అన్ని సూచికలను సాధించి జిల్లాను ఆదర్శంగా నిలపాలని అన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మునగ, వెలగ, కరివేపాకు, చింత, ఉసిరి మొక్కలను నాటాలని సూచించారు. ఈ మొక్కల ద్వారా ఎన్నో పోషకాలు అందుతాయని తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో డిజిటల్ లెర్నింగ్ వసతులు ఏర్పాటు చేయాలని డీఈఓను ఆదేశించారు. కార్యక్రమంలో సీపీఓ శ్రీనివాసరావు, డీఎంహెచ్ఓ భాస్కర్ నాయక్, డీఈఓ వెంకటేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల విజేతలకు ప్రశంసపత్రాలు అందించారు.



కొమరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

పారిశుద్ధ్య చర్యలపై దృష్టి పెట్టాలి

స్థాయీ సంఘాల సమావేశాల్లో జెడ్పీ చైర్మన్ కంచర్ల



మాట్లాడుతున్న కంచర్ల చంద్రశేఖర్ రావు

చుంచుపల్లి: వర్షాకాలంలో జనావాసాల్లో చెత్త లేకుండా ఎప్పటికప్పుడు వీధులు, డ్రెయినేజీలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో క్రమం తప్పకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు అధికారులకు సూచించారు. గురువారం జెడ్పీ హాల్‌లో నిర్వహించిన స్థాయీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని, వైద్య సిబ్బంది నిరంతరం సేవలందించాలని కోరారు. వరద ముంపు మండలాల్లో అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ సేవలందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను మరింతగా పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. గర్భిణులు, బాలింతల కోసం అంగన్‌వాడీ కేంద్రాలకు సన్న బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతులకు పంటలపై అవగాహన కల్పించాలని, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు మార్కెట్‌లో లభించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయించకుండా చూడాలని, అమ్మే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశాల్లో జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ కె.చంద్రశేఖర్, జెడ్పీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూసమస్య ఇంకా సమసిపోలేదు



ఖమ్మంలో నిర్వహించిన ర్యాలీలో న్యూడెమొక్రసీ నాయకులు, కార్యకర్తలు

- దొడ్డి కొమరయ్య వర్ధంతి సభలో చలపతిరావు
- ఖమ్మంలో భారీ ర్యాలీ, సదస్సు

ఖమ్మంమయూరిసెంటర్: దేశంలో నేటికీ భూమి సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదని.. పాలకులు తీసుకొచ్చిన చట్టాలతో పరిష్కారం కాని నేపథ్యాన తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో భూమి కోసం పోరాటాలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జే.వీ.చలపతిరావు పిలుపునిచ్చారు. దొడ్డి కొమరయ్య వర్ధంతిని పురస్కరించుకుని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ రెండు పార్టీల ఆధ్వర్యాన ఖమ్మంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఏర్పాటుచేసిన సదస్సులో చలపతిరావు మాట్లాడుతూ రివిజనిస్టులు, పాలకవర్గ కమ్యూనిస్టు పార్టీలకు చెందిన ఆనాటి అగ్ర నాయకుల సారథ్యాన తెలంగాణ సాయుధ పోరాటాన్ని విరమింపజేశారన్నారు. పోరాటం కొనసాగినప్పుడు పేదలకు లక్షల ఎకరాల భూ పంపిణీ జరిగిందన్నారు. ఆతర్వాత దేశంలో మౌలిక మార్పు లేమీ రాలేదని చెప్పారు. ఇప్పటివరకు కూడా 65శాతం నుండి 70 శాతం నిరుపేదల చేతిలో సెంట్ భూమి కూడా లేకపోగా, అతి కొద్దిమంది చేతుల్లోనే భూమి కేంద్రీకృతమైందని తెలిపారు. ఈనేపథ్యాన తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో భూమి కోసం పోరాటాలు చేయాల్సి ఉందని చలపతిరావు అభిప్రాయపడ్డారు. ఈ సదస్సుకు ఆవునూరి మధు, గొని ఐలయ్య అధ్యక్షత వహించగా న్యూడెమొక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు సాదినేని వెంకటేశ్వరరావు, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, పార్టీ రాష్ట్ర నాయకులు వి.కోటేశ్వరరావు, కె.గోవర్ధన్, పీఓడబ్ల్యూ నాయకులు వి.సంధ్య, రాజేంద్రప్రసాద్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ మాట్లాడారు. నాయకులు కోలా లక్ష్మీనారాయణ, బజ్జూరి వెంకటరామిరెడ్డి, ఎస్.కే.ఖాసీం, వై.ప్రకాశ్, రమేష్, వెంకన్న, వీ.వీ.రావు, సీతారామయ్య, జడ సత్యనారాయణ, మురళి, ఎం.గిరి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్‌లు ఇంకెన్నాళ్లో?

ఏజెన్సీ డీఈఓ పోస్టు రద్దయి ఎనిమిదేళ్లు..

- ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో తగ్గుతున్న ఫలితాలు
- ఐటీడీఏ పరిధిలో మొత్తం 80 విద్యాసంస్థలు
- పోస్ట్ పునరుద్ధరణపై పీఓ దృష్టి పెట్టాలంటున్న విద్యావేత్తలు



ఐటీడీఏ కార్యాలయం

భద్రాచలం: ఐటీడీఏ పరిధిలోని గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఆశించిన మేర ఫలితాలు రావడం లేదు. 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తామని ప్రతీ సంవత్సరం అధికారులు చెబుతున్నా ఆచరణ సాధ్యం కావడం లేదు. ఆయా విద్యా సంస్థలపై పర్యవేక్షణ కొరవడడమే దీనికి ప్రధాన కారణమని తెలుస్తోంది. ఇన్‌చార్జ్‌లుగా కొందరు అధికారులను నియమించినా.. వారికి ఈ బాధ్యతలు భారం కావడంతో సక్రమంగా దృష్టి సారించలేకపోతున్నారు. దీంతో గిరిజన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఐటీడీఏ పరిధిలోని గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, బెస్ట్ అవైలబుల్ స్కూళ్లపై నిరంతర పర్యవేక్షణ కొనసాగాలంటే ఎనిమిదేళ్ల క్రితం రద్దు చేసిన ఏజెన్సీ డీఈఓ పోస్టును పునరుద్ధరించాలని విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాల వారు నూతన పీఓ రాహుల్‌ను కోరుతున్నారు.

ఇన్‌చార్జ్‌ల పర్యవేక్షణలో నిర్వహణ..

తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2016లో జిల్లాల పునర్విభజన జరిగింది. దీంతో ఖమ్మం నుంచి భద్రాద్రి కొత్తగూడెం ప్రత్యేక జిల్లాగా ఏర్పడింది. ఈ క్రమంలో అప్పటివరకు భద్రాచలం కేంద్రంగా ఉన్న ఏజెన్సీ డీఈఓ పోస్టును జిల్లా విద్యాశాఖ అధికారి పోస్ట్‌గా అప్‌గ్రేడ్ చేశారు. ఇక నాటి నుంచి ఐటీడీఏ పరిధిలోని ఏజెన్సీ డీఈఓ పోస్ట్ మాయమైంది. దీంతో జిల్లా కేంద్రంలో ఉన్న డీఈఓ ఆధ్వర్యంలోనే అన్ని విద్యాసంస్థలు నడుస్తున్నాయి. అయితే ఐటీడీఏ పరిధిలో నడిచే ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల తలా ఒక దిక్కుకు వెళ్లాయి. ప్రస్తుతం ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లకు ఐటీడీఏ డీడీ మణెమ్మ ఇన్‌చార్జ్‌గా ఉండగా, గురుకులాల ఇన్‌చార్జ్‌గా ఆర్‌సీఓ వెంకటేశ్వరరాజు వ్యవహరిస్తున్నారు. వీరిలో ఏ అధికారి మారినా ఐటీడీఏ కీలక విభాగంలో ఉన్న అధికారికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించడం పరిపాటిగా మారింది.


నిరంతర పర్యవేక్షణతోనే ఫలితాలు..

ప్రస్తుతం ఐటీడీఏ పరిధిలో 50 ఆశ్రమ పాఠశాలలు, 3 బెస్ట్ అవైలబుల్ పాఠశాలలు ఉన్నాయి. భద్రాచలం, దమ్మపేట, ఇల్లెందు డివిజన్లుగా విభజించి ఆశ్రమ పాఠశాలలను కొనసాగిస్తున్నారు. ఇక భద్రాద్రి జిల్లాలో 21, ఖమ్మం జిల్లాలో ఆరు.. మొత్తం 27 గురుకులాలు, స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లు పని చేస్తున్నాయి. 2016కు ముందు వీటన్నింటి పర్యవేక్షణ ఏజెన్సీ డీఈఓ పరిధిలో ఉండేది. ఈ అధికారి నిరంతరం వీటిని పర్యవేక్షిస్తూ ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు ఇస్తూ గిరిజన విద్య పటిష్టతకు పునాదులు వేసేవారు. చివరిసారిగా రవీందర్ బాబు ఏజెన్సీ డీఈఓగా పనిచేశారు. ఆ తర్వాత ఐటీడీఏలో పనిచేసే ఇతర విభాగాల అధికారులకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తుండగా వారు పని ఒత్తిడితో పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేకపోతున్నారు. ఐటీడీఏ పీఓ మానిటరింగ్ చేస్తున్నా విద్యాబోధన, ఫలితాలు మెరుగుపడడం లేదు. ప్రధానంగా ఇంగ్లిష్, మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో ఎక్కువ మంది ఫెయిలవుతున్నారు. సెల్ఫ్ సెంటర్లు ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో అత్యధిక ఫలితాలు వస్తుండగా, లేనిచోట దారుణంగా పడిపోతున్నాయి. విద్యావ్యవస్థలో ఉన్న లోపాలను ఇది ఎత్తిచూపుతోందని పలువురు అంటున్నారు.

పీఓ దృష్టి సారిస్తే..

ఐటీడీఏ పీఓగా బి.రాహుల్ ఇటీవలే బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ వాసి, తెలుగు మీడియంలో చదివిన ఆయనకు విద్యారంగంపై మంచి పట్టు, అవగాహన ఉంది. ఐటీడీఏ ఆధ్వర్యంలోని పాఠశాలలు, కళాశాలల్లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తానని ఇప్పటికే చెప్పిన నేపథ్యాన ఏజెన్సీ డీఈఓ పోస్టును పునరుద్ధరించాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఫలితాలపై ప్రభావం పడుతోంది



గతంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏజెన్సీ డీఈఓ పర్యవేక్షణ ఉన్నప్పుడు ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందించేవారు. విద్యార్థుల సమస్యలు కూడా ఉన్నతాధికారులకు తెలిసే అవకాశం ఉండేది. నిరంతర పర్యవేక్షణతో మెరుగైన ఫలితాలు వచ్చేవి. కానీ ఎనిమిదేళ్లుగా ఇన్‌చార్జ్‌లకు బాధ్యతలు అప్పగించడంతో ఫలితాలపై ప్రభావం పడుతోంది. ఉన్నతాధికారులు ఈ విషయాన్ని గమనించి ఏజెన్సీ డీఈఓ పోస్టును పునరుద్ధరించాలి.

– మునిగడప రామాచారి, టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి

క్లుప్తంగా

రేపు ఉమ్మడి జిల్లాస్థాయి స్విమ్మింగ్ ఎంపిక పోటీలు

ఖమ్మంస్పోర్ట్స్: కొత్తగూడెంలోని సీఈఆర్ క్లబ్‌లో ఈ నెల 6న ఉమ్మడి జిల్లాస్థాయి సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికల స్విమ్మింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.హన్మంతరాజు తెలిపారు. ఇక్కడ ఎంపిక చేసే జట్టును ఈ నెల 13, 14వ తేదీల్లో సికింద్రాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 10 గంటలకు రిపోర్టు చేయాలని, పూర్తి వివరాల కోసం 98669 23395 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

7న ఫుట్‌బాల్ పోటీలు

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలస్థాయి బాలికల సబ్ జూనియర్ ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు ఈ నెల 7న వి.వెంకటాయపాలెంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహిస్తున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.ఆదర్శ్‌కుమార్ తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచే వారితో మహబూబ్‌నగర్‌లో ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేస్తామని వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు వయసు ధ్రువీకరణపత్రం, ఆధార్ కార్డు, నాలుగు ఫొటోలు, కిట్‌తో ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చేయాలని, వివరాలకు 99896 47696 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

డీఎస్పీ రవీందర్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మణుగూరు టౌన్: ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తతతోపాటు అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని బాపనకుంటలో కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా గురువారం తెల్లవారుజామున కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నివాసాల్లో తనిఖీలు నిర్వహించి ధ్రువపత్రాలు లేని మోటార్ సైకిళ్లు, ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరాలతోపాటు, గంజాయి నిర్మూలనతో కలిగే లాభాలు, కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. అసాంఘిక శక్తులకు సహకార నిరాకరణ, ముఖ్య సమాచారం పోలీసులకు చేరవేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. 20 మోటార్ సైకిళ్లు, నాలుగు ఆటోలు, ఒక ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు సీఐ సతీష్‌కుమార్, అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి, బయ్యారం ఎస్‌ఐ, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ అమర్‌సింగ్

దుమ్ముగూడెం : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అమర్ సింగ్ సూచించారు. గురువారం దుమ్ముగూడెం, నర్సాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. జాతీయ సికిల్ సెల్ డిసీస్ నిర్మూలన కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. సికిల్ సెల్ డిసీజ్ స్క్రీనింగ్‌లో ప్రతీ ఒక్కరికి అభా కార్డ్ క్రియేట్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. స్క్రీనింగ్ టెస్ట్‌లో పాజిటివ్ /క్యారియర్ వచ్చిన వారికి తప్పకుండా కన్ఫర్మేషన్ టెస్ట్(హెచ్‌పీఎల్‌సీ) నిర్వహించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీల్లో ప్రసవాల పెంపునకు, సీజనల్ డిసీజెస్‌పై తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు స్పందన, రాకేష్, పుల్లా రెడ్డి, సుభాష్, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.26.45 లక్షలకు మోరంపల్లి బంజర సంత



సంత వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

బూర్గంపాడు: మోరంపల్లి బంజర వారపు సంత వేలంపాట రూ 26.45 లక్షలకు ఖరారైంది. మోరంపల్లిబంజర గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన వేలంపాటలో రూ.లక్ష డిపాజిట్ చెల్లించి పలువురు పాటలో పాల్గొన్నారు. అశ్వాపురానికి చెందిన కోటేశ్వరరావు రూ 26.45 లక్షలకు సంతను వేలంలో దక్కించుకున్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే పశువుల, కూరగాయల సంత వేలంపాటను ఈ ఏడాది ఎన్నికల కోడ్ కారణంగా ఆలస్యంగా నిర్వహించారు. తొమ్మిది నెలల కాలవ్యవధికి వేలంపాట నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జమలారెడ్డి, డీఎల్‌పీఓ సుధీర్, ఎంపీఓ సునీల్, పంచాయతీ కార్యదర్శి భవాని తదితరులు పాల్గొన్నారు.

'భరోసా' దక్కేనా ?

- ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న కౌలు రైతులు
- పంట నష్టపోయినా ప్రభుత్వం నుంచి అందని సాయం
- కాంగ్రెస్ ప్రభుత్వ ప్రకటనతో రైతు భరోసాపై ఆశలు
- ఏజెన్సీలో కౌలు ఒప్పందాలకు చట్టబద్ధత ఉండేనా!



భూమిని సాగు చేస్తున్న కౌలు రైతు

బూర్గంపాడు: ఏళ్ల తరబడి పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్న కౌలు రైతులకు ప్రభుత్వ ప్రకటనలతో ఆశలు చిగురిస్తున్నాయి. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కౌలు రైతులకు కూడా రైతు భరోసా పథకం కింద ఎకరాకు రూ.15 వేల పెట్టుబడి సాయమందిస్తామని హామీ ఇచ్చింది. ఇప్పుడు ఆ హామీ అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకోసం సబ్‌కమిటీని ఏర్పాటు చేసి విధి విధానాలను ఖరారు చేయాలని ఆదేశించింది. అయితే కౌలు రైతులను గుర్తించే విషయంలో చాలా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వీటిని అధిగమించి తమకు ప్రభుత్వ సాయం అందుతుందా లేదా అనే ఆందోళన కూడా కౌలు రైతుల్లో వ్యక్తమవుతోంది.

55 వేల మంది వరకు కౌలు రైతులు

జిల్లాలో సుమారు 55 వేల మంది వరకు కౌలు రైతులున్నారు. వీరు పట్టాదారుల నుంచి భూమిని కౌలుకు తీసుకుని పంటలు సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి గత ప్రభుత్వంలో పెట్టుబడి సాయం కింద ఇచ్చిన రైతుబంధు పథకం వర్తించలేదు. పంటలు సాగు చేసినా, లేకున్నా పట్టాదారుల బ్యాంకు ఖాతాల్లోనే రైతుబంధు జమైంది. బ్యాంకుల నుంచి పంటరుణాలను తీసుకునే అవకాశాలు కూడా లేవు. కేవలం ప్రైవేటు అప్పులతోనే కౌలు రైతులు పంటలు సాగు చేసే పరిస్థితులున్నాయి. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయినా ప్రభుత్వం నుంచి రూపాయి సాయం కూడా అందటం లేదు. వ్యవసాయ ఉత్పత్తులను ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో, సీసీఐల్లో అమ్ముకోవాలంటే పట్టాదారుల పేరు మీదనే అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కౌలు రైతులు సాగు చేసే పంటలకు ప్రభుత్వం అందించే పంటల బీమా కూడా వర్తించటం లేదు.

గుర్తింపే పెద్ద సమస్య..

కౌలు రైతుల గుర్తింపు పెద్దసమస్యగా పరిణమించే పరిస్థితులు కనబడుతున్నాయి. 2011లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన కౌలురైతు చట్టం ప్రకారం భూ యజమాని, కౌలురైతు ప్రభుత్వం తీసుకువచ్చిన ఫార్మెట్‌లో సంతకాలు చేయాలి. నాడు బ్యాంకుల్లో కౌలు రైతుల పంట రుణాల కోసం ప్రభుత్వం ఈ చట్టాన్ని తెచ్చింది. కానీ ప్రస్తుతం భూ యజమానులు రైతు భరోసాను వదులుకుని కౌలురైతులకు ఇచ్చేందుకు సిద్ధంగా లేరు. దీంతో కౌలు రైతులకు రైతు భరోసా ఇచ్చే ప్రక్రియపై తీవ్ర చర్చసాగుతోంది. ఇప్పటికే ప్రభుత్వం రైతుభరోసా విధివిధానాలపై రైతుల అభిప్రాయాలను కూడా సేకరిస్తోంది. రైతుల అభిప్రాయాలు, సబ్ కమిటీ నివేదికల ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి.

ఏజెన్సీలో కౌలు ఒప్పందాలు చెల్లేనా..?

జిల్లాలో కౌలు చట్టాల అమలు కూడా ప్రశ్నార్థకమయ్యే అవకాశాలున్నాయి. జిల్లాలో 85శాతం మేర భూములు ఏజెన్సీ పరిధిలో ఉన్నాయి. ఏజెన్సీ చట్టాల ప్రకారం భూముల కౌలు ఒప్పందాలు చెల్లవని కొన్ని ఆదివాసీ గిరిజన సంఘాలు చెబుతున్నాయి. గిరిజనేతరులు భూములను కౌలుకు తీసుకుంటే వాటికి చట్టబద్ధత కల్పించేందుకు ఏజెన్సీ చట్టాలు అడ్డురావచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం కూడా ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని కౌలు రైతులకు ఏవిధంగా రైతు భరోసా అందించాలనే ప్రక్రియపై కసరత్తు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సబ్ కమిటీలో కౌలు రైతుల గుర్తింపులో భూ యజమానుల అభిప్రాయాలు, అభ్యంతరాలను కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో భూములు సాగు చేసే గిరిజనేతర కౌలు రైతులకు ఏవిధంగా ప్రభుత్వ సాయమందించాలనే విషయంపై కూడా లోతైనా అధ్యయనం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 20వ తేదీలోగా కౌలు రైతుల గుర్తింపునకు సంబంధించిన విధి విధానాలను సబ్ కమిటీ ప్రభుత్వానికి నివేదించనుంది.

రూపాయి సాయం అందడం లేదు



ఏటా 15 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని పత్తి వేస్తున్నాను. ప్రభుత్వం నుంచి ఎప్పుడు కూడా రూపాయి సాయం అందలేదు. పత్తిని అమ్ముకోవాలన్న పట్టాదారులను బతిమాలి వారి పేరు మీదనే అమ్ముకోవాలి. ఈ సారి ప్రభుత్వం కౌలురైతులకు సాయమందిస్తామని చెబుతోంది. వస్తుందో రాదో చూడాలి.

-పునుగుపాటి కృష్ణ, కౌలురైతు

వ్యక్తిపై కేసు నమోదు

భయంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం

దుమ్ముగూడెం : మండలంలోని కాశీనగరం గ్రామానికి చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేయగా, భయంతో కలుపుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన హెబినైజర్ తన భార్య సలోమిని మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురి చేస్తుండటంతో ఆరు నెలల క్రితం చర్ల మండలం సత్యనారాయణపురం గ్రామంలోని పుట్టింటికి వెళ్లింది. గురువారం డ్వాక్రా గ్రూపు పని మీద ఆమె కాశీనగరం గ్రామానికి రాగా, భర్త వెళ్లి దాడి చేశాడు. దీంతో సలోమి ఫిర్యాదు మేరకు పోలీసులు అతన్ని స్టేషన్‌కు పిలిపించారు. దీంతో భయపడి బయటకు వెళ్లి స్టేషన్ ముందు రోడ్డుపై పురుగుల మందు తాగి, స్టేషన్‌లోకి వచ్చాడు. స్టేషన్‌కు వచ్చిన మిగతా ప్రజలు గమనించి పోలీసులకు తెలపడంతో వారు 108 ద్వారా భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. హెబినైజర్ భార్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేశవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ముగ్గురు మహిళలపై కేసు..

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురం డబల్‌బెడ్రూం ఇళ్ల సముదాయం సమీపంలో ఉన్న బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ ఎస్‌బీఎల్ బ్యాటరీల చోరీకి ప్రయత్నించిన ముగ్గురు మహిళలపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ దయానంద్ కథనం ప్రకారం.. బుధవారం పడమటనర్సాపురంలోని బీఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలో అనుమానాస్పదంగా ముగ్గురు మహిళలు తిరుగుతున్నారని స్థానికులు డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. దీంతో పోలీసులు వచ్చి వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. విచారించగా మణుగూరుకు చెందిన వారు సెల్‌టవర్ బ్యాటరీల చోరీకి వచ్చినట్లు తేలింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బీజేపీ నాయకుల సస్పెన్షన్



వివరాలు వెల్లడిస్తున్న బీజేపీ నాయకులు

దమ్మపేట: భారతీయ జనతా పార్టీలోనే ఉండి, పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన నాయకులను రాష్ట్ర అధినాయకత్వం ఆదేశాల మేరకు పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు అశ్వారావుపేట నియోజకవర్గ కన్వీనర్ గొట్టిపళ్ల దుర్గా శ్రీనివాస్ వెల్లడించారు. గురువారం దమ్మపేటలో బీజేపీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దమ్మపేట మండలానికి చెందిన పల్లపు వెంకటేశ్వరరావు, వాసం పోలయ్య, గూడ ముత్యాలరావు, రత్నకుమారి, పూచిక ప్రసాద్, పసుపులేటి నాగరాజులు పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో సొంత పార్టీకి వ్యతిరేకంగా పనిచేశారని అన్నారు. ఈ కారణంగా పార్టీ నుంచి సస్పెండ్ చేశామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉడతనేని విశ్వేశ్వరరావు, ముసలయ్య, పసుమర్తి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళపై కత్తితో మరో మహిళ దాడి




తీవ్ర గాయాల పాలైన శిరీష

సింగరేణి(కొత్తగూడెం): ఇంట్లో ఉన్న మహిళపై మరో మహిళ కత్తితో దాడిచేసి గాయపరిచిన ఘటన కొత్తగూడెం రెండో టౌన్ పరిధిలోని చుంచుపల్లి మండలం రుద్రంపూర్ పంచాయతీలో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. రుద్రంపూర్ పంచాయతీ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల సమీపంలోని క్వార్టర్ నంబర్ డి.163 నివాసం ఉంటున్న చేపలమడుగు శిరీషను మధ్యాహ్నం ఒకటిన్నర గంటల ప్రాంతంలో తన ఇద్దరు పిల్లలతో కలిసి ఇంట్లో ఉంది. దీంతో అదే పంచాయతీ ఎదురుగడ్డ ప్రాంతానికి చెందిన పావని ముఖానికి మాస్క్ ధరించి ఇంట్లోకి చొరబడి శిరీషపై కత్తితో దాడి చేసింది. దీంతో పిల్లలు భయంతో బయటకు వచ్చి కేకలు వేయడంతో ఇరుగుపొరుగు మహిళలు వెళ్లగా, వారిని గమనించి పావని కత్తిని వదిలేసి పారిపోయింది. తీవ్ర గాయాలైన శిరీషను 100 ద్వారా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితురాలి భర్త శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టూ టౌన్ సీఐ రమేష్ తెలిపారు. కాగా దాడికి గల కారణాలు తెలియాల్సిఉంది.

ఇద్దరిపై కేసు నమోదు

ఇల్లెందు: విద్యాసంస్థల బంద్ నేపథ్యంలో ముందస్తుగా ఇద్దరు విద్యార్థి సంఘం నేతలను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. విద్యార్థి సంఘం నాయకులు సాయికుమార్, బయ్య అభిమన్యులపై భారతీయ న్యాయ సంహిత చట్టంలోని సెక్షన్ 151 ప్రకారం ముందస్తుగా అరెస్టు చేసినట్లు సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపారు.

అక్రమ నిర్మాణాల అడ్డగింత



ఆలయ భూముల్లో కట్టడాలను అడ్డుకుంటున్న అధికారులు

భద్రాచలంటౌన్: తెలంగాణ సరిహద్దులో ఉన్న ఏపీలోని భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి భూముల్లో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను ఆలయ అధికారులు గురువారం అడ్డుకున్నారు. పురుషోత్తపట్నం గ్రామపంచాయతీ పరిధిలోని దేవాలయ భూములను కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో ఆలయ అధికారులు అడ్డుకోవడంతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

అశ్వారావుపేటరూరల్: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. అనంతారం వద్ద గల పెదవాగు నుంచి అశ్వారావుపేటకు ఇసుక తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు అశ్వారావుపేట ఫారెస్టు రేంజర్ మురళి తెలిపారు. ట్రాక్టర్లను రేంజ్ కార్యాలయానికి తరలించి సీజ్ చేసి, కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న వెల్డర్ మృతి

అశ్వారావుపేటరూరల్: ప్రమాదవశాత్తు ఇంటిపై నుంచి కింద పడి గాయపడిన ఓ వెల్డర్ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఎస్సై శివరామకృష్ణ కథనం ప్రకారం.. ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన ఎస్‌కే షరీఫ్(52) ఏడాది నుంచి అశ్వారావుపేటలో నివాసం ఉంటూ, వెల్డింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే బుధవారం అశ్వారావుపేట మండలంలోని వాగొడ్డుగూడెం గ్రామంలో ఓ ఇంటిపై రేకులు వేసేందుకు ఐరన్ పైపులకు వెల్డింగ్ చేస్తుండగా అదుపుతప్పి ఇంటిపైనుంచి జారి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడటంతో రాజమండ్రి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫాతిమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జీఎస్టీ చెల్లింపుల్లో వెసులుబాటు

ఖమ్మంగాంధీచౌక్: టాక్స్ డిమాండ్‌పై వడ్డీ, అపరాధ రుసుం విషయంలో వ్యాపారులకు వెసులుబాటు కల్పించారని వస్తు సేవా పన్ను (జీఎస్టీ) అసిస్టెంట్ కమిషనర్ పి.మరియదాసు వెల్లడించారు. జీఎస్టీ దినోత్సవం సందర్భంగా గురువారం ఖమ్మంలోని కేంద్ర జీఎస్టీ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. వస్తు సేవా పన్ను చెల్లింపులపై వ్యాపారులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఆ తర్వాత జీఎస్టీ సూపరింటెండెంట్లు జాన్ నూతన్‌కుమార్, విజయ్‌పాల్, ఎంపీ శేషగిరి రావు, ఎంతీశ్‌చంద్ర ఇటీవల జరిగిన 53వ జీఎస్టీ కౌన్సిల్‌లో తీసుకున్న నిర్ణయాలను వివరించారు.

నల్లబెల్లం స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న నల్లబెల్లం, ఆటో

కరకగూడెం: ఆటోల్లో అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రాజేందర్ కథనం ప్రకారం.. బుధవారం రాత్రి సమయంలో కరకగూడెంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో దుగినేపల్లి గ్రామానికి చెందిన నరేష్, శ్రీకాంత్ ములుగు జిల్లా మేడారం నుంచి ఆటోలో 5 క్వింటాళ్ల నల్లబెలాన్ని అక్రమంగా తీసుకొస్తుండగా పట్టుకుని, స్టేషన్‌కు తరలించారు. గురువారం సాయంత్రం గోవిందపురం గ్రామానికి చెందిన దుర్గయ్య మేడారం నుంచి అక్రమంగా 5 క్వింటాళ్ల బెల్లాన్ని మరో ఆటోలో తన స్వగ్రామానికి తీసుకొస్తుండగా పోలీసులు తాటిగూడెం వద్ద పట్టుకున్నారు. రెండు ఘటనల్లో పట్టుకున్న బెల్లం విలువ సుమారు రూ. 50 వేలు ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు. నిందితులపై కేసులు నమోదు చేసి ఆటోలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

చర్ల: మద్యం తాగొద్దని చెప్పినందుకు మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. చర్లకు చెందిన మామిడి కృష్ణ అతిగా మద్యం తాగడంతో 15రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. ఆరోగ్యం కాస్తా కుదటపడగా బుధవారం మళ్లీ మద్యం తాగాడు. దీంతో మద్యం తాగొద్దని భార్య సత్యవేణి మందలించగా, మనస్తాపం చెంది గ్రామశివారులో చెరువు వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజువర్మ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చర్ల: మండలంలోని చినమిడిసిలేరు సమీపంలో గురువారం బొలేరో వాహనం బోల్తా పడి ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. చర్ల వైపు నుంచి తిప్పాపురం మీదుగా ఛత్తీస్‌గఢ్‌కు వెళ్తున్న బొలేరో వాహనం పెదమిడిసిలేరు దాటాక అదుపు తప్పి పక్కన ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. దీంతో డ్రైవర్, వాహనంలోని ప్రయాణికుడు స్వల్ప గాయపడ్డారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది వారిని ఆస్పత్రికి తరలించారు.

మా కుటుంబానికి న్యాయం చేయండి

ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు ప్రొద్దుటూరు రైతు కుటుంబీకుల వినతి



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న ప్రభాకర్ తండ్రి పెద్దవీరభద్రయ్య

చింతకాని: గ్రామపెద్దల ప్రోద్బలంతో కొందరు తమ పొలాన్ని నాశనం చేయడంతో తమ కుమారుడు బోజెడ్ల ప్రభాకర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని.. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి తమ కుటుంబానికి న్యాయం చేయాలని చింతకాని మండలం ప్రొద్దుటూరుకు చెందిన బోజెడ్ల పెద్దవీరభద్రయ్య కోరారు. జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్‌తో కలిసి ప్రభాకర్ కుటుంబసభ్యులు గురువారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కలిశారు. ఈ సందర్భంగా వ్యవసాయ భూమి విషయమై నెలకొన్న వివాదం, ఘర్షణ వివరాలను వెల్లడించిన ఆయన తహసీల్దార్, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా సకాలంలో స్పందించలేదని తెలిపారు. చివరకు తన కుమారుడు ప్రభాకర్ ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు. ఈ మేరకు సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్య తీసుకోవడంతో పాటు పోషించే దిక్కు కోల్పోయిన తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, బీఆర్‌ఎస్ నాయకులు పెంట్యాల పుల్లయ్య, బొడ్డు వెంకట్రామయ్య, పాసుగోటి రత్నాకర్, వేముల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులోకి ఒకరు..

ఖమ్మంఅర్బన్: చింతకాని మండలం ప్రొద్దుటూరుకు చెందిన రైతు బోజెడ్ల ప్రభాకర్ ఖమ్మంలో సోమవారం ఆత్మహత్య చేసుకోగా ఖమ్మం అర్బన్ (ఖానాపురం హవేలీ) పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. రైతు ఆత్మహత్యకు ముందు ఆయనతో ఎవరెవరు మాట్లాడారనే అంశంపై ఆరా తీయగా అందుకు సంబంధించిన ఆధారాలు లభించడంతో వీడియో తీసిన ఇద్దరిని గుర్తించినట్లు తెలిసింది. ఇందులో ఒకరిని గురువారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయమై సీఐ భాను ప్రకాష్‌ను వివరణ కోరగా విచారణ సాగుతోందని, శుక్రవారం నాటికి స్పష్టత వస్తుందని తెలిపారు.

రెవెన్యూ కార్యకలాపాలపై నిఘా వర్గాల ఆరా

చింతకాని: చింతకాని మండలం ప్రొద్దుటూరులో భూవివాదం నేపథ్యాన ఓ రైతు ఆత్మహత్య చేసుకోవడం, మరో కుటుంబానికి చెందిన భూరిజిస్ట్రేషన్ విషయమై వివాదంనెలకొన్న నేపథ్యాన మండలంలో రెవెన్యూ సంబంధిత కార్యకలాపాలపై నిఘా వర్గాలు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ప్రొద్దుటూరులో భూవివాదంపై రెవెన్యూ అధికారులు స్పందించలేదని ఆరోపిస్తూ రైతు బోజెడ్ల ప్రభాకర్ ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. అలాగే, పందిళ్లపల్లిలో వెలుగులోకి వచ్చిన మరో భూవివాదంపై పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో తహసీల్‌లో రెవెన్యూ కార్యాకలాపాలపై నిఘా వర్గాలు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. రెవెన్యూ అధికారుల తీరుతో భూసమస్యలు పెరుగుతున్నాయని, సమస్యల పరిష్కారంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు సైతం ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం.

అత్యాధునిక వైద్యం, నిపుణులైన వైద్యులు



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ సుధీంద్రరెడ్డి

ఖమ్మంవైద్యవిభాగం: కిమ్స్ ఆస్పత్రిలో అత్యాధునిక వైద్యసేవలు అందించేందుకు నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారని నిర్వాహకులు తెలిపారు. ఆస్పత్రి న్యూరో సర్జన్ డాక్టర్ పెద్దిరెడ్డి సుధీంద్రరెడ్డి ఆధ్వర్యాన ఖమ్మంలోని ఆస్పత్రిలో గురువారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల పరీక్షలే కాక న్యూరో సర్జన్ విభాగంలో వైద్యసేవల్లో రాయితీ ఇచ్చారు. రోడ్డు ప్రమాదాల కారణంగా మెదడులో రక్తస్రావం తదితర సమస్యలకు చికిత్స కోసం తమ ఆస్పత్రిలో నిపుణులైన వైద్యులు 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని నిర్వాహకులు తెలిపారు. కాగా, ప్రత్యేక శిబిరం శుక్రవారం కూడా కొనసాగుతుందని, నడుమునొప్పి, మెడనొప్పి, మైగ్రేన్, సయాటిక, పక్షవాతం, ఫిట్స్ తదితర సమస్యలతో బాధపడుతున్న వినియోగించుకోవాలని సూచించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు రాయల చంద్రశేఖర్



సభలో మాట్లాడుతున్న రాయల చంద్రశేఖర్

పాల్వంచరూరల్: పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు రాయల చంద్రశేఖర్ సూచించారు. మండల పరిధిలోని జగన్నాథపురంలో గురువారం నిర్వహించిన సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్(ప్రజాపంథా) జిల్లా ప్లీనరీ సభలో ఆయన మాట్లాడారు. పారిశ్రామిక, పాలకవర్గాల కుట్రలను బట్టబయలు చేస్తూ పేదోళ్ల రాజ్యాన్ని సాధించేవరకు అవిశ్రాంతంగా ఉద్యమించాలన్నారు. ప్రజాసమస్యలపై అధ్యయనం చేస్తూ ఉద్యమాలను నిర్మించాలన్నారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శిగా ముద్దా భిక్షం, సహాయ కార్యదర్శిగా నాయని రాజులను ఎన్నుకున్నారు. అనంతరం పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య వర్ధంతి నిర్వహించారు. కొమరయ్య చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, కెచ్చెల రంగారెడ్డి, చంద్ర అరుణ, కెచ్చెల కల్పన, అమర్లపూడి రాము, మాచర్ల సత్యం, జాటోతు కృష్ణ, నూపా భాస్కర్, నిమ్మల రాంబాబు, గోకినపల్లి ప్రభాకర్, పోతుగంటి లక్ష్మణ్, కల్లూరు కిషోర్, కంగాల కల్లయ్య, ఆర్.మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబూ.. పద్ధతి మార్చుకో

▶ మొదటి పేజీ తరువాయి

దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని నిప్పులు చెరిగారు. ఇది ఏ మాత్రం న్యాయం కాదని, ముఖ్యమంత్రి చంద్రబాబు పాపాలు పండుతున్నాయని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై, మంచి పాలన అందించడంపై చంద్రబాబు దృష్టి పెడితే మంచిదన్నారు. నెల్లూరు సెంట్రల్ జైల్లో ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని గురువారం వైఎస్ జగన్ ములాఖత్ ద్వారా పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా విధ్వంసక చర్యలు జరుగుతున్నాయి. కేవలం టీడీపీకి ఓటు వేయలేదన్న కారణంతో ఏకంగా ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. దొంగ కేసులు పెడుతున్నారు. వీళ్లే కొడతారు, మళ్లీ వీళ్లే అటు వైపున ఉన్న వారి మీద కేసులు పెడతారు. ఇంతటి దారుణంగా ఈ రోజు రాష్ట్రంలో పరిపాలన సాగిస్తున్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పరిపాలనలో కులం చూడలేదు, మతం చూడలేదు. ప్రాంతం చూడలేదు. చివరికి ఏ పార్టీకి ఓటు వేశారన్నది కూడా చూడకుండా ప్రతి పథకం, ప్రతి మంచిని అర్హత ప్రామాణికంగా ప్రతి ఇంటికీ డోర్ డెలివరీ చేశాం. ఈ రోజు చంద్రబాబునాయుడుకు ఓటు వేయలేదనే కారణంతో అన్యాయంగా రాష్ట్రాన్ని రావణకాష్టం చేస్తున్నారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను విరగ్గొడుతున్నారు.. పగలగొడుతున్నారు. ఇవన్నీ శిశుపాలుని పాపాల మాదిరిగా పండుతాయి. ప్రజాస్వామ్యంలో ఏదైనా ప్రజలకు మంచి చేసి ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకుని, ప్రజల దగ్గరకు వెళ్లి ఫలానా మంచి చేశాం కాబట్టి ఓటు వేయండి అనే పరిస్థితులు ఉండాలి. కానీ ఈ మాదిరిగా దౌర్జన్యాలు చేసి, అన్యాయమైన కేసులు పెట్టి, ఆస్తులు ధ్వంసం చేసి, భయాందోళనలు సృష్టిస్తూ రాజకీయాలు చేస్తే, అలాంటి రాజకీయం ఏ రోజూ నిలబడదు. తాత్కాలిక మేలు ఏదైనా జరుగుతుందేమో కానీ తర్వాత ఓటు వేసేటప్పుడు ప్రజలు ఇవన్నీ కచ్చితంగా గుర్తు పెట్టుకుంటారు. అందుకే చంద్రబాబులో మార్పు రావాలి. లేదంటే ప్రజలు లెక్కా జమా సరిచేసి చంద్రబాబుకు గట్టిగా బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి' అని వైఎస్ జగన్ నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..


నెల్లూరులో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

ప్రజలు మీకు ఓటు వేసింది ఎందుకు?

- ప్రజలకు మంచి చేసి వైఎస్సార్‌సీపీ ఓడిపోలేదు. చంద్రబాబు నాయుడు చేసిన మోసపూరిత హామీలకు ప్రజలు కాస్తో కూస్తో కొద్దిగా ఆకర్షితులయ్యారు. 10 శాతం ఓట్లు అటు షిఫ్ట్ అయ్యి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చారు. మేనిఫెస్టోలో చంద్రబాబు అనేక హామీలు ఇచ్చారు. రైతులకు రైతు భరోసా కింద ఏడాదికి రూ.20 వేలు ఇస్తానన్నారు. ఖరీఫ్‌లో జోరుగా వ్యవసాయం పనులు జరుగుతున్నాయి. రైతన్నలు పంటలు వేగంగా వేస్తున్నారు. ఇంతవరకు రైతు భరోసా రూ.20 వేలు ఇస్తానన్న దానికి అతీగతీ లేదు.
- బడులు మొదలయ్యాయి. అమ్మ ఒడి కింద జగన్ రూ.15 వేలు ఐదేళ్ల పాటు ఇచ్చాడు. చంద్రబాబు నాయుడు ఎంత మంది పిల్లలుంటే అంత మందికీ ఇస్తాడని, ప్రతి ఒక్కరికీ రూ.15 వేలు ఇస్తాడని చెప్పారు. రాష్ట్రంలో కోటి మందికి పైగా బడి ఈడు పిల్లలున్నారు. తల్లికి వందనం కింద ఆ డబ్బులేమయ్యాయి అని ప్రతి తల్లీ అడుగుతోంది.
- 18 ఏళ్లు పైబడిన ప్రతి అక్క చెల్లెమ్మకు రూ.1,500 చొప్పున సంవత్సరానికి రూ.18 వేలు ఇస్తామని చెప్పారు. రాష్ట్రంలో 4.12 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని మొన్ననే లెక్కలు తేలాయి. అందులో దాదాపుగా 2.10 కోట్ల మంది మహిళా ఓటర్లే. అందరూ 18 సంవత్సరాలు నిండిన వారే. ప్రతి నెలా రూ.1500 ఇస్తానన్నావు, ఏమైంది? అని వీరందరూ ఈ రోజు అడుగుతున్నారు.
- వీటన్నింటి మీద ధ్యాస పెట్టే కార్యక్రమం చంద్రబాబు నాయుడు చేయాలి. గవర్నెన్స్ మీద కాస్త ధ్యాస పెట్టి ఆ తల్లులకు డబ్బులిచ్చే కార్యక్రమం చూడండి. రైతులకు రూ.20 వేలు ఇచ్చే కార్యక్రమం చూడండి. ప్రజలు ఎందుకు తమకు ఓటు వేశారు అని చంద్రబాబు నాయుడు ఆలోచించాలి. ఇవేవీ కూడా చేయకుండా కేవలం భయాందోళనలు నెలకొల్పాలి.. రాష్ట్రంలో రావణకాష్టం రగిలించాలి.. దొంగ కేసులు పెట్టి ఇరికించాలి.. ఆస్తులను ధ్వంసం చేయాలి.. వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీకి ఓటు వేసిన వారెవరినీ ఉంచకూడదు అన్న దుర్మార్గపు ఆలోచనలతో అడుగులు ముందుకు వేయడం అతి హేయమైన రాజకీయం.

పిన్నెల్లిపై ఇంత అన్యాయంగా కక్ష సాధింపా?

- పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మీద ఏకంగా 307 అంటే హత్యాయత్నం కేసు పెట్టారు. ఏ రకంగా అన్యాయంగా అతన్ని జైల్లో నిర్బంధించారో చూస్తున్నాం. కారంపూడి ఘటన జరిగిందెప్పుడు? ఎన్నికలు అయిపోయిన మరుసటి రోజు అంటే మే 14న. కారంపూడిలో టీడీపీ అకృత్యాలకు ఒక ఎస్సీ కుటుంబంలోని మహిళలు ఇబ్బంది పడే పరిస్థితి వచ్చినందున వాళ్లను పరామర్శించడానికి డీఎస్పీ అనుమతి తీసుకుని అప్పటి ఎమ్మెల్యే పిన్నెల్లి బయల్దేరాడు.
- కారంపూడికి అటు వైపున ఎస్సీ కుటుంబం ఇల్లు ఉంటే.. ఎమ్మెల్యే ఊర్లోకి ప్రవేశించక ముందే ఇటు వైపు అడ్డగించారు. గొడవ టౌన్‌లో జరుగుతుంటే పిన్నెల్లిని ఊరుబయటే అడ్డగించారు. నారాయణస్వామి అనే సీఐని పిన్నెల్లి చూసిన దాఖలాలు కూడా లేవు. మే 14న గొడవ జరిగితే 9 రోజుల తర్వాత అంటే మే 23న ఆయనకేదో జరిగింది అన్నట్లుగా ఆ సీఐ, రామకృష్ణారెడ్డి మీద హత్యాయత్నం కేసు పెట్టాడు. ఆ సీన్లో లేని వ్యక్తిపై ఈ కేసు బనాయించారు. ఇది అన్యాయం కాదా?
- అసలు ఇన్సిడెంట్ నిజంగా జరిగిందో లేదో కూడా తెలియదు. మే 14న జరిగి ఉంటే మే 15న మెడికో లీగల్ కేసు ఎందుకు పెట్టలేదు? 17వ తేదీన కేంద్ర ఎన్నికల సంఘం సిట్ వేసింది. 17 నుంచి 20వ తేదీ వరకు పల్నాడు ప్రాంతంలో ఆ సిట్ బృందం తిరిగి ఘటనపై రిపోర్టు ఇచ్చింది. ఆ రిపోర్టులో ఎందుకు ఈ అంశం రాలేదు? అలాంటప్పుడు ఈ రకంగా హత్యాయత్నం కేసులో ఒక మనిషిని ఇరికించడం ధర్మమేనా?

ప్రతి దశలో ఓ రెడ్‌బుక్


- ప్రతి ఒక్కరూ వాళ్ల వాళ్ల స్థాయిలో రెడ్‌బుక్స్ అని చెప్పి పెట్టుకున్నారు. చంద్రబాబు స్థాయిలో ఒక రెడ్‌బుక్, లోకేశ్ స్థాయిలో ఒక రెడ్‌బుక్, ఎమ్మెల్యే స్థాయిలో, మండల స్థాయిలో, గ్రామ స్థాయిలో ఇలా రెడ్‌బుక్‌లు పెట్టుకుని ఏం చేస్తున్నారు? అతి దారుణంగా, అన్యాయంగా ఆస్తులు ధ్వంసం చేస్తున్నారు.
- మీ విధ్వంసాలు, దాడులను రాష్ట్రం మొత్తం చూస్తోంది. కానీ ఎవరూ మాట్లాడటం లేదు. దొంగ కేసులు పెడుతున్నారు. చీనీ చెట్లు నరికేస్తున్నారు. జేసీబీలు, పొక్లెయిన్ల మీద స్వయంగా ఎమ్మెల్యేలు తిష్ట వేసి బిల్డింగులు పగలగొట్టే కార్యక్రమాలు చేస్తున్నారు. ఊరూరా ఆస్తుల ధ్వంసం, దాడులు, దౌర్జన్యాలపై పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు.

ఎమ్మెల్యే 10 సార్లు ఫోన్ చేసినా ఎస్పీ స్పందించలేదు

- మే 13న ఎన్నికల సమయంలో పాల్వాయి గేట్ అనే పోలింగ్ కేంద్రం దగ్గరకు అప్పటి ఎమ్మెల్యే వెళ్లినప్పుడు జరిగిన ఘటన మీద మరో కేసు పెట్టారు. అసలు ఆ ఘటన ఎందుకు జరిగింది? అక్కడ ఉన్న ఎస్సీ సామాజిక వర్గం వారు పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఓటు వేసే పరిస్థితి లేనప్పుడు ఎమ్మెల్యే ఆ గ్రామానికి వెళ్లారు. ఆ పరిస్థితులను చూసి ఎస్పీకి 10 సార్లు ఫోన్ చేసినా కూడా స్పందించని పక్షంలో కనీసం సీఐని, ఎస్సైని పంపించండనే పరిస్థితుల్లో ఉన్నారు. అలాంటి సెన్సిటివ్ బూత్‌లో కేవలం ఒకే ఒక్క హోంగార్డును పెట్టారు. అటువంటి పరిస్థితుల్లో ఆ ఘటన జరిగింది. ఆ ఈవీఎం పగలగొట్టిన కేసులో తనకు బెయిల్ వచ్చింది. కానీ ఎవరిపైనో హత్యాయత్నం చేశాడని తప్పుడు కేసులు పెట్టి ఇవాళ జైలు పాలు చేశారు.
- ఈ ఘటన జరిగిన 10 రోజుల తర్వాత అంటే మే 23వ తారీఖున కేసులు పెట్టారు. రిగ్గింగ్‌ను అడ్డుకునే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చేస్తే, హత్యాయత్నం చేశాడని తప్పుడు కేసులు పెట్టారు. నిజంగా అటువంటిది జరిగి ఉంటే సిట్ 17వ తారీఖు నుంచి 20వ తారీఖు మధ్యలో ఇచ్చిన రిపోర్టులో చెప్పాలి కదా? 2009 నుంచి వరుసగా నాలుగు సార్లు పిన్నెల్లి గెలిచాడంటే మంచోడు కాబట్టే ప్రజలు ఆశీర్వదిస్తూ వచ్చారు. అటువంటి వ్యక్తిని తీసుకొచ్చి తప్పుడు కేసుల్లో ఇరికించడం ఎంత వరకు ధర్మం? ఈ రోజు ఇది రామకృష్ణారెడ్డి ఒక్కడి పరిస్థితే కాదు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఇలానే జరుగుతోంది.
- వైఎస్ జగన్ వెంట మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, అంబటి రాంబాబు పిన్నెల్లితో ములాఖత్‌లో పాల్గొన్నారు. మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు తలశీల రఘురామ్, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, బల్లి కల్యాణ చక్రవర్తి ప్రెస్‌మీట్‌లో పాల్గొన్నారు.

'విభజన' కొలిక్కి వచ్చేనా?

రేపు హైదరాబాద్‌లో తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీ • అపరిష్కృత విభజన వివాదాలపై చర్చించనున్న నేతలు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న విభజన వివాదాలు మళ్లీ తెరపైకి రానున్నాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు కొలువుదీరిన నేపథ్యంలో అపరిష్కృత అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య మళ్లీ చర్చలు ప్రారంభం కానున్నాయి. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఎ.రేవంత్‌రెడ్డి, ఎన్.చంద్రబాబునాయుడు శనివారం హైదరాబాద్ లోని ప్రజాభవన్‌లో సమావేశమై వీటిపై చర్చించనున్నారు. గతంలోనూ పలుసార్లు చర్చలు జరిగినా ప్రతిష్టంభన తొలగలేదు. కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్ షా నేతృత్వంలో జరిగిన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశాల్లో సైతం వివాదాలకు పరిష్కారం లభించలేదు. ఈ నేపథ్యంలో శనివారం జరిగే భేటీపై ఆసక్తి నెలకొంది. రెండు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న ముఖ్యమైన అంశాలను ఓసారి పరిశీలిస్తే..

షెడ్యూల్–9లోని ప్రభుత్వరంగ సంస్థల విభజనపై

విభజన చట్టంలోని షెడ్యూల్–9లో పొందుపరిచిన 91 ప్రభుత్వ రంగ సంస్థల్లో 53 సంస్థల విభజనపై రెండు రాష్ట్రాల మధ్య ఎలాంటి విభేదాలు లేవు. 15 సంస్థల విభజనకు తెలంగాణ అంగీకరించగా, ఏపీకి మాత్రం అభ్యంతరాలున్నాయి. మిగిలిన 23 సంస్థల విభజన విషయంలో తెలంగాణకు అభ్యంతరాలున్నాయి. ఇందుకు సంబంధించి షీలా భిడే కమిటీ సిఫారసులను పూర్తిగా అంగీకరించాలని ఏపీ కోరుతుండగా, కొన్నింటిపై తెలంగాణకు అభ్యంతరాలున్నాయి. దక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ల్యాండ్ హోల్డింగ్స్ లిమిటెడ్(దిల్)కు హైదరాబాద్‌లో కేటాయించిన భూములను తెలంగాణ స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించగా, ఏపీ హైకోర్టు నుంచి స్టే తెచ్చుకుంది. దిల్ ఆస్తులను సైతం విభజించాలని నిపుణుల కమిటీ సిఫారసు చేయడాన్ని తెలంగాణ వ్యతిరేకిస్తోంది. పలు సంస్థలకు సంబంధించి తెలంగాణ హైకోర్టులో కేసులు పెండింగ్‌లో ఉండడంతో గతంలో నిర్వహించిన చర్చల్లో ముందడుగు పడలేదు.

ముదిరిన ఫైనాన్స్ కమిషన్ విభజన

ఏపీ ఫైనాన్స్ కమిషన్ విభజన ప్లాన్.. కమిషన్ బోర్డు 2016లో ఏకపక్షంగా రూపొందించి కేంద్ర ప్రభుత్వ ఆమోదానికి పంపడంతో వివాదం ముదిరింది. రంగారెడ్డి జిల్లాలో ఉన్న 238 ఎకరాల భూములను కమిషన్ నుంచి స్వాధీనం చేసుకోవడానికి తెలంగాణ ప్రయత్నించగా, ఏపీ ప్రభుత్వం 2015లో హైకోర్టు నుంచి స్టే తెచ్చుకుంది. నాటి నుంచి న్యాయస్థానంలో కేసు పెండింగ్‌లో ఉంది. రూ.వేల కోట్ల విలువ చేసే భూములు కావడంతో రెండు రాష్ట్రాల మధ్య సయోధ్య కుదరడం లేదు.

ప్రాతిపదిక జనాభానా? ప్రాంతమా?

షెడ్యూల్–10లోని 142 ప్రభుత్వ రంగ సంస్థల విభజనపై ప్రతిష్టంభన నెలకొంది. ఏపీ ఉన్నత విద్యామండలి కేసులో సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాల ఆధారంగా ఈ సంస్థల విభజనకు కేంద్రం గతంలో మార్గదర్శకాలు జారీ చేయగా తెలంగాణ అంగీకరించింది. జనాభా దామాషా ప్రకారం నగదు నిల్వలను, లొకేషన్ (ప్రాంతం) ఆధారంగా స్థిరాస్తుల పంపకాలు జరపాలని కేంద్రం మార్గదర్శకాల్లో కోరింది. దీనిపై ఏపీ హైకోర్టును ఆశ్రయించగా, కేసు పెండింగ్‌లో ఉంది. ప్రాంతం ప్రాతిపదికన కాకుండా జనాభా దామాషా ఆధారంగా షెడ్యూల్–10 సంస్థల ఆస్తుల విభజన జరగాలని ఏపీ కోరుతుండగా, తెలంగాణ వ్యతిరేకిస్తోంది. సింగరేణి సంస్థ పూర్తిగా తెలంగాణదేనని, దాని అనుబంధ కంపెనీ అప్మెల్‌ను సైతం తమకే కేటాయించాలని తెలంగాణ కోరుతుండగా, ఏపీ మాత్రం సింగరేణి సంస్థతో పాటు అప్మెల్ విభజన జరపాలని కోరుతోంది. ఏపీ పౌరసరఫరాల సంస్థ విభజనకు ముందు తెలంగాణ వాడుకున్న రూ.354 కోట్లకు పైగా రుణాల చెల్లింపులను తెలంగాణ చేయాల్సి ఉండగా, కేంద్రం నుంచి తమకు రావాల్సిన సబ్సిడీ బకాయిలను ఏపీ బదిలీ చేయాలని తెలంగాణ కోరుతోంది. ఇక విభజన చట్టంలో పొందుపరచని 12 సంస్థల విభజనకు ఏపీ పట్టుపడుతుండగా, తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.

వేల కోట్ల విద్యుత్ బిల్లులు

రెండు రాష్ట్రాల మధ్య విద్యుత్ బిల్లుల బకాయిల వివాదంపై ఎన్నో దఫాలుగా చర్చలు జరిగినా కొలిక్కి రాలేదు. తెలంగాణ నుంచి రూ.6,015 కోట్ల విద్యుత్ బిల్లుల బకాయిలు రావాల్సి ఉందని ఏపీ డిమాండ్ చేస్తుండగా, ఏపీ నుంచే తమకు రూ.17,828 కోట్లు రావాల్సి ఉందని తెలంగాణ పేర్కొంటోంది. ఏపీకి రూ.6,015 కోట్ల బకాయిలను చెల్లించాలని గతంలో కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేయగా, తెలంగాణ హైకోర్టును ఆశ్రయించి తమకు అనుకూలంగా ఉత్తర్వులు తెచ్చుకుంది.

తెగని జల పంచాయితీలు

తెలంగాణలో నిర్మిస్తున్న పాలమూరు–రంగారెడ్డిపై ఏపీ, ఏపీలో నిర్మిస్తున్న రాయలసీమ ఎత్తిపోతలపై తెలంగాణ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. కృష్ణా జలాల ఆధారంగా నిర్మిస్తున్న ప్రధానమైన ఈ రెండు ప్రాజెక్టులతో పాటు పలు ఇతర ప్రాజెక్టులపై సైతం రెండు రాష్ట్రాల మధ్య విభేదాలు నెలకొన్నాయి. కృష్ణాజలాల శాశ్వత పంపకాలు, గోదావరిపై కొత్త ప్రాజెక్టుల నిర్మాణం వంటి అంశాలపై సైతం విభేదాలున్నాయి. రెండు రాష్ట్రాల సీఎంల మధ్య జరిగే చర్చల్లో కృష్ణా, గోదావరి జలాల పంపకాలు, ప్రాజెక్టులపై సైతం చర్చ జరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

జిల్లా వార్తలు

సీహెచ్‌పీ, క్వార్టర్ల నిర్మాణాలను పరిశీలించిన డైరెక్టర్


క్వార్టర్ల పనులపై ఆరా తీస్తున్న డైరెక్టర్, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలోని 3 ఇంక్లెన్‌లో కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (సీహెచ్‌పీ), క్వార్టర్ల నిర్మాణ పనులను సింగరేణి డైరెక్టర్ (పా) ఎన్‌వీకే శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. కొత్తగూడెం ఏరియాలో ప్రతిపాదిత వీకేఓసీ విస్తరణలో భాగంగా రుద్రంపూర్‌లోని ఎస్‌ఆర్‌టీ, వనమానగర్, మాయాబజార్‌లో ఇళ్లు కోల్పోనున్న వారి కోసం పునరావాసకాలనీ, సీహెచ్‌పీ ఉద్యోగుల క్వార్టర్లు నిర్మిస్తుండగా పరిశీలించిన డైరెక్టర్ పలు సూచనలు చేశారు. పనుల్లో ఏమాత్రం నాణ్యత లోపించినా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏరియా జీఎం శాలేంరాజు, అధికారులు సూర్యనారాయణ, రామకృష్ణ, రమేశ్, సూర్యనారాయణ, సదానందం తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ సామాజిక బాధ్యత


సారపాక బీట్‌లో ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న సీసీఎఫ్ భీమానాయక్, అధికారులు

బూర్గంపాడు/దుమ్ముగూడెం: అటవీ సంరక్షణను శాఖ ఉద్యోగులే కాకుండా ప్రజలు సైతం సామాజిక బాధ్యతగా భావించాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ భీమానాయక్ కోరారు. అశ్వాపురం అటవీ రేంజ్ పరిధిలోని సారపాక ఫారెస్ట్ బీట్‌లో ప్లాంటేషన్ పనులను గురువారం పరిశీలించిన ఆయన దుమ్ముగూడెం లో ఆధునికీకరించిన డీఆర్వో క్వార్టర్లను డీఎఫ్‌ఓ కిష్టాగౌడ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం సీసీఎఫ్ మాట్లాడుతూ అటవీశాఖ ఉద్యోగులు అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ అటవీ సంపదను రక్షించాలని, రాత్రి వేళ తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. రేంజర్ కనకమ్మ, డీఆర్‌ఓలు సుజాత, శోభన్‌నాయక్, ఎఫ్‌బీఓ భీమ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

ఐదెకరాలు.. కాదు పదెకరాలు!

- పెట్టుబడి సాయంపై రైతుల భిన్నాభిప్రాయాలు
- సాగు చేసే వారందరికీ ఇవ్వాలని ఇంకొందరి విజ్ఞప్తి
- ముగిసిన 'రైతు భరోసా' సభలు
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 97 పీఏసీఎస్‌ల్లో అభిప్రాయ సేకరణ



మణుగూరు మండలంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న స్థానికులు, వేదికపై డీసీఓ ఖుర్షీద్ తదితరులు (ఫైల్)

నేలకొండపల్లి: రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం 'రైతుభరోసా'గా మార్చింది. అంతేకాకుండా పథకం అమలులో మార్పులు తీసుకురావాలని యోచిస్తోంది. పెట్టుబడి సాయం పంపిణీలో పరిమితులు, ఇతర అంశాల్లో మార్పులు చేయాలనే నిర్ణయానికి రాగా గత కొద్దిరోజులుగా రైతుల నుంచి క్షేత్రస్థాయిలో అభిప్రాయాలు సేకరిస్తున్నారు. ఈ మేరకు గురువారంతో గ్రామసభలు పూర్తి కాగా.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రైతుల అభిప్రాయ సేకరణ పరిశీలనకు వరంగల్, హన్మకొండ జిల్లాల అధికారులను నియమించారు. వీరి ఆధ్వర్యాన పీఏసీఎస్‌ల వారీగా సభలు నిర్వహించి పెట్టుబడి సాయం అమలుపై రైతుల అభిప్రాయాలను సేకరించారు. గత ప్రభుత్వం పట్టాదారులందరికీ ఎకరాకు రూ.5 వేల చొప్పున రెండు సీజన్లలో పెట్టుబడి సాయం అందించగా.. ఇప్పుడు అలా కాకుండా ఐదెకరాలకే పరిమితం చేయాలని కొందరు.. పది ఎకరాల వరకు ఇవ్వాలని ఇంకొందరు అభిప్రాయాలు వెల్లడించారు. అంతేకాక సాగు చేసిన వారందరికీ ఇవ్వాల్సిందేనని మరికొందరు తెలిపారు. ఈ నేపథ్యాన ఖమ్మం జిల్లాలో 76, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 21 పీఏసీఎస్‌ల పరిధిలో నిర్వహించిన సభల్లో రైతులు వెల్లడించిన అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు.

అభిప్రాయ సేకరణ ఎలా..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 97 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పరిధిలో ప్రత్యేక మహాజన సభలు నిర్వహించారు. ఖమ్మం జిల్లాలోని 76 సంఘాలకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయగా, ఈ బృందాల బాధ్యతలను వరంగల్, హన్మకొండ జిల్లాలకు చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, కాకతీయ ట్రైనింగ్ కాలేజీ ఫ్యాకల్టీ, జిల్లా వ్యవసాయాధికారికి అప్పగించారు. ఒక్కో బృందం రోజుకు మూడు సొసైటీల పరిధిలో సభలు నిర్వహించి రైతుల అభిప్రాయాలను సేకరించింది. ఇక భద్రాద్రి జిల్లాలో 21 సంఘాలు ఉండగా, జిల్లా సహకార అధికారి, జిల్లా వ్యవసాయాధికారితో రెండు బృందాలను ఏర్పాటు చేయడంతో వీరు రోజుకు రెండు సంఘాల్లో అభిప్రాయ సేకరణ చేపట్టారు. కాగా, గత నెల 29న ప్రారంభమైన మహాజన సభలు గురువారం ముగిశాయి.

పది ఎకరాల వరకు ఓకే..

రైతు భరోసా విషయమై రైతుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఎక్కువ మంది పది ఎకరాల లోపు సాగు భూములకే పెట్టుబడి సాయం ఇవ్వాలని కోరారు. కొద్ది మంది ఐదెకరాలకే పరిమితం చేయాలని సూచించారు. రియల్ ఎస్టేట్ వెంచర్లు, గుట్టలను పరిగణనలోకి తీసుకోవద్దని, ఉద్యోగులకు ఇవ్వొద్దని కోరారు. అంతేకాక రైతులకు సబ్సిడీపై ఎరువులూ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇక కౌలు రైతులకు ఇవ్వాలనే వినతులు కూడా అందాయి. మరోపక్క కొందరు మాత్రం పరిమితి లేకుండా సాగు భూములన్నింటికీ పెట్టుబడి సాయం అందించాలని కోరడం గమనార్హం.

ఉన్నతాధికారుల దృష్టికి రైతుల అభిప్రాయాలు



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పీఏసీఎస్‌ల పరిధిలో రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించాం. వీటన్నింటినీ క్రోడీకరించి ప్రభుత్వాన్ని నివేదిక రూపంలో ఇస్తాం. అయితే, ఏ రోజుకా రోజు నివేదికను ఉన్నతాధికారులకు పంపించాం.

– ఎస్.డీ.ఖుర్షీద్, భద్రాద్రి, ఖమ్మం జిల్లాల సహకార అధికారి

గిరిజనులను సాదరంగా స్వాగతించాలి

- తద్వారా సమస్యలతో వచ్చేవారికి సాంత్వన
- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్


నూతన సమావేశ మందిరాన్ని పరిశీలిస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం: సమస్యలను విన్నవించుకునేందుకు దూరప్రాంతాల నుంచి ఐటీడీఏకు వచ్చే గిరిజనులను సాదరంగా స్వాగతించి వారి బాగోగులు తెలుసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన సమావేశ మందిరం, రెండో అంతస్తులోని వివిధ విభాగాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. గిరిజనుల కుటుంబాల ఆర్థికాభివృద్ధికి చేయూతనివ్వడంతో పాటు విద్యా, వైద్య రంగాల్లో సేవలందించాలని తెలిపారు. ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి రిజిస్టర్‌లో నమోదు చేసి అర్హులైన గిరిజనులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యాలయానికి వచ్చే గిరిజనులకు విభాగాలు సులువుగా తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, అధికారులు తానాజీ ప్రభాకర్‌రావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెట్‌ను అభినందించిన పీఓ


ఇప్పటికే పరుగు పందెం పోటీల్లో రాణిస్తూ అత్యుత్తమ శిక్షణ కోసం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాయ్ వెళ్తున్న దుమ్ముగూడెం మండలం కోయనర్సాపూర్‌కు చెందిన పాయం కుమారిని పీఓ రాహుల్ అభినందించారు. కార్యక్రమంలో ఆదివాసీ ఓంశక్తి మహిళా సంఘం అధ్యక్షురాలు సుధారాణి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ నెల 9న ఐటీడీఏలోని స్క్రాప్ మహేంద్ర వాహనాన్ని వేలం వేయనున్నందున ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని పీఓ సూచించచారు.

కరివేద వరి సాగుపై అవగాహన


మాట్లాడుతున్న కేవీకే కోఆర్డినేటర్ రవికుమార్

కామేపల్లి: వరి సాగులో నేరుగా విత్తే వెసులుబాటు ఉన్న కరివేద విధానంతో రైతులకు మేలు జరుగుతుందని వైరా కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రవికుమార్ తెలిపారు. కామేపల్లిలోని రైతు వేదికలో పీఏ ఫౌండేషన్ ఆధ్వర్యాన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. కరివేద విదానంలో కలుపు, ఎరువు, నీటి యాజమాన్య పద్ధతులను వివరించారు. అనంతరం కామేపల్లి, తాళ్లగూడెం గ్రామాల్లో రైతులు ఈ విధానంలో సాగు చేసిన పొలాలను పరిశీలించారు. ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ తారాదేవి, ఫౌండేషన్ సభ్యులు హర్షదీప్, రాధ, ఏఈఓలు శ్రీకన్య, మున్నీ, ప్రతిభ, ఉష, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి వద్ద గోదావరికి జలకళ


భద్రాచలం వద్ద గోదావరి నీటి ప్రవాహం

భద్రాచలంలో గోదావరి నది గురువారం జలకళ సంతరించుకుంది. గత మూడు నెలలుగా ఎడారిని తలపించగా.. ఎగువన కురుస్తున్న వర్షాలతో నీరు చేరుతుండగా గురువారం సాయంత్రానికి భద్రాద్రి వద్ద 9.5 అడుగులకు చేరుకుంది. దీంతో స్థానికులు పెద్ద సంఖ్యలో చేరుకుని నదీజలాలకు పూజలు చేశారు. ఎగువన భారీ వర్షాలతో ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేయడంతో భద్రాచలం వద్ద క్రమేపీ ప్రవాహం పెరుగుతోంది. ఈనేపథ్యాన అప్రమత్తమైన అధికారులు వరద మరింత పెరిగి పట్టణంలోకి చేరితే తోడేందుకు భారీ మోటార్లు సిద్ధం చేస్తున్నారు.

– భద్రాచలంటౌన్


పట్టణంలోకి నీరు చేరితే తోడేందుకు మోటార్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది